సాక్షి
ఏలూరు
గురువారం । 11 । జూలై । 2024



చక్కని చిత్తరువులు
ఆకట్టుకునే చిత్రాలు గీస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు. అంశం ఏదైనా అలవోకగా చిత్రాలు గీస్తూ రాణిస్తున్నారు. 8లో ▸



విద్యుత్ విజిలెన్స్ దాడులు
నూజివీడు మండలంలోని అన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో మొత్తం రూ.5.53 లక్షల జరిమానా విధించారు. 8లో ▸



జ్యూస్ దుకాణం సీజ్
శ్రీవారి క్షేత్రంలో జ్యూస్‌ల తయారీలో నిల్వ పాల ప్యాకెట్లను వినియోగిస్తూ భక్తుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వ్యాపారి బాగోతం బట్టబయలైంది. 8లో ▸

న్యూస్‌రీల్

నారసింహుని అవతారంలో జగన్నాథుడు



నారసింహుని అవతారంలో దర్శనం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జగన్నాథుడు నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో సాక్షాత్కరిస్తున్నారు. అందులో భాగంగా శంఖు చక్రాలను ధరించి, అమ్మవారితో ఆసీనులై ఉన్న స్వామివారు భక్తులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టు ఉన్న అలంకారం భక్తులకు కనువిందు చేసింది.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం



ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: ఉచిత ఇసుక పాలసీ ప్రజలకు వరమని సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఉచిత ఇసుక పంపిణీపై ప్రజల అవగాహన కల్పించేందుకు ఇసుక ట్రాక్టర్‌తో బుధవారం మంత్రి పార్థసారథి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇసుక పాలసీతో నిర్మాణ రంగం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూజివీడు పట్టణాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుతో ఉచిత వైద్యం

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఏలూరు టౌన్: ఆరోగ్యశ్రీ కార్డుతో ఉచితంగా వైద్యం అందించాలని.. అదనంగా డబ్బులు వసూలు చేస్తే ఆయా హాస్పిటల్స్‌పై చర్యలు తప్పవని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఏలూరు జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.రాజీవ్ అన్నారు. ఏలూరు జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకాన్ని 31 ప్రైవేటు హాస్పిటల్స్‌లో రోగులకు సేవలు అందించేలా అనుమతులు ఉన్నాయని, ఈ ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్రలు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్న ప్రైవేటు హాస్పిటల్స్‌లో అవుట్‌పేషెంట్ విభాగంలో టెస్టులు ఉచితంగా చేస్తారని, డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ సేవలు వర్తించే రోగుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేయరని ఆయన తెలిపారు. ఆరోగ్యమిత్ర తమ దగ్గర డబ్బులు కట్టించుకున్నారని రోగి రాతపూర్వకంగా తెలియజేస్తే సొమ్ము తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని, ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు తణుకులో జాబ్ మేళా

తణుకు టౌన్: ఈ నెల 11న తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో బీటీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థలో అక్కౌంటెంట్లు, ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్స్, టాక్స్ ఏజెన్సీ, కెమిస్ట్ పోస్టుల భర్తీ కోసం ఈ జాబ్‌మేళాలో ఎంపిక జరుగుతుందన్నారు. 2021–2024 మధ్య డిగ్రీ పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు 9866215054, 9381838672లో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలి



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. బుధవారం భీమవరం బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం ముగిసిపోయి అన్నదమ్ముల్లా ఉంటున్న మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడానికి, వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెస్తున్నారన్నారు.

పేరుకే ఉచితం.. అంతా దోపిడీ

- ఉమ్మడి జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లు, మూడు స్టాక్ యార్డ్‌లు ప్రారంభం
- మిగతా ఇసుక రీచ్‌ల అనుమతులు పెండింగ్‌లోనే
- వరద ముంపు అనుమతులు లేకపోవడంతో తెరుచుకోని రీచ్‌లు
- చేబ్రోలు స్టాక్‌పాయింట్‌లో టన్ను ధర రూ.538
- రవాణా ఖర్చులు అధికం
- ఉచితమంటూ జీఎస్టీ, సీనరేజ్, అడ్మిన్, లోడింగ్ చార్జీలు



ఉంగుటూరు మండలం చేబ్రోలులోని ఇసుక స్టాక్ పాయింట్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉచిత ఇసుక పాలసీ అంటూ కూటమి ప్రభుత్వం చేసిన ఆర్భాటమంతా డొల్లేనని తేలింది. ఒక్క రూపాయి చెల్లించకుండా నిర్మాణ అవసరాలకు పూర్తి ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. దానికి అనుగుణంగానే అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక పథకం ప్రారంభిస్తున్నామని విపరీతంగా ప్రచారం చేసి మంగళవారం నుంచి అమలులోకి తెచ్చారు. కట్ చేస్తే.. జీఎస్టీ మొదలుకొని టన్ను ఇసుక వరకు ప్రతి దానికి ధర నిర్ణయించి అనేక ఆంక్షలు విధించి ఉచిత ఇసుక మాటున దోపిడీకి తెరదీశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గోదావరి నది పరివాహక ప్రాంతం అధికంగా ఉంది. ఈ క్రమంలో ఏలూరు జిల్లాలో ఐదు ఇసుక రీచ్‌లు, 3 డీసిల్ట్ రీచ్‌లు ఉన్నాయి. జిల్లాలో ఆరు స్టాక్ యార్డులున్నాయి. నూతన పశ్చిమగోదావరి జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లు, 5 డీసిల్టేషన్ పాయింట్లు, 6 స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఇవన్నీ గతం నుంచే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో కేవలం కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, వింజరం, ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులోని స్టాక్ పాయింట్లలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. మిగిలిన ఏ ఒక్క రీచ్ కూడా పూర్తి స్థాయిలో తెరుచుకోలేదు. పర్యావరణ అనుమతులు పెండింగ్‌లో ఉండటం, నిబంధనలకు అనుగుణంగా లేకపోవడం, గోదావరి వరద ప్రారంభం నేపథ్యంలో ఒక్క రీచ్ కూడా ప్రారంభం కాలేదు. అధికారులు మాత్రం జిల్లా అంతటా ఉచితంగా ఇసుక లభిస్తుందంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇబ్రహీంపేట, దాచారం, వింజరం, వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట 1, 2, పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతంలోని 1, 2, నడిపూడి 1, 2, కరుగోరుమిల్లి, కోడేరు, ఏలూరు జిల్లాలో గూటాల, గూటాల–1, పట్టిసీమ, పశ్చిమగోదావరి జిల్లాలో యలమంచిలి, నర్సాపురంలో ఐదు డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి.

అధిక ధరలు.. కఠిన ఆంక్షలు

ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు స్టాక్ పాయింట్, ఇబ్రహీంపేట, వింజరం స్టాక్‌పాయింట్లలో ఇసుక విక్రయాలు ప్రారంభించారు. వీఆర్‌ఓ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని ఆధార్ కార్డు జిరాక్స్‌తో చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు ధర రూ.538 చెల్లించి ఇసుక కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అధికారికంగా లోడింగ్ చార్జీలు రూ.30, అడ్మిన్ చార్జీలు రూ.20, సీనరేజ్ ఫీజు రూ.88, జీఎస్టీ రూ.13.40 మొత్తం కలిపి రూ.152లు టన్ను ఇసుక ధరలోనే కలిపి తీసుకుంటున్నారు. అనధికారికంగా మాత్రం లోడింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు టన్ను రూ.538 చొప్పున ఒక లారీ లోడుకు (20 టన్నులు) రూ. 10,760 చెల్లించాలి. 50 కిలోమీటర్ల పరిధి వరకు రూ.6 వేల నుంచి 8 వేలు, 50 కిలోమీటరు దాటితే రూ.120 వసూలు చేస్తున్నారు. రవాణా చార్జీ అదనంతో వసూలు ఇష్టానుసారం సాగుతుంది. 70 కిలోమీటర్ల దూరానికి ఇసుకను తీసుకెళ్లాలంటే లోడింగ్, ఇసుక ఖర్చు కలిపి రూ. 20 వేల వరకు ఉంది. గత ప్రభుత్వ హయాంలో టన్ను ధర రూ.100కు తక్కువ ఉండటం గమనార్హం.

పశ్చిమలో నో స్టాక్:

పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక నిల్వలు ఫుల్‌గా ఉన్నా 6 ఇసుక రీచ్‌లు, 5 డీసిల్టేషన్ పాయింట్లలో ఎక్కడా ఇసుక లేని పరిస్థితి. అనుమతులు రాకపోవడంతో అన్ని రీచ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పశ్చిమగోదావరి జిల్లా వాసులు, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం పందలపర్రు, పెరవలి మండలం పెండ్యాల, కోనసీమ జిల్లాలోని రావులపాడు స్టాక్ పాయింట్ల నుంచి తెచ్చుకోవాలి. అవి భీమవరానికి సగటున 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. 20 టన్నుల లారీకి అన్ని ఖర్చులు కలిపి రూ. 15 వేల వరకు అవుతుండగా రోజుకు లారీ ఒక ట్రిప్ మాత్రమే పడుతుందనే కారణంగా అదనంగా మరో రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. రావులపాడు, పందలపర్రు స్టాక్‌పాయింట్ నుంచి 20 టన్నుల లారీ భీమవరానికి వస్తే రూ.17 వేలు, నర్సాపురానికి రూ.15 వేలు, పాలకొల్లు రూ.12 వేలు, ఉండి రూ.18 వేలు, తాడేపల్లిగూడెం రూ.15 వేలు, తణుకు రూ.11 వేలు, ఆచంట రూ.10 వేలు వసూలు చేస్తున్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషిచేయాలి



భీమడోలులో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో డీఈవో ఎస్.అబ్రహం, ఎంఈవోలు

భీమడోలు: విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిది రోజులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. కోర్సు డైరెక్టర్‌గా అయినపర్తి భాస్కర్‌కుమార్ వ్యవహరించారు. మాస్టర్ ట్రైనీలు ఎస్‌కే మస్తాన్, పెద్దిరాజులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ శిక్షణ తరగతుల ద్వారా ఉపాధ్యాయులు నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి పదేళ్లకు విద్యావ్యవస్థలో కీలకమార్పులు సంభవిస్తున్నాయని, టీచర్లు అందుకు అనుగుణంగా పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): కౌలు రైతులు, వీధి వ్యాపారులు, ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ఆర్థిక తోడ్పాటుకు సులభంగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి బ్యాంకర్లకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో 2024–25 మొదటి త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రుణ ప్రణాళిక లక్ష్యం రూ.18,256 కోట్లుగా నిర్దేశించామని చెప్పారు. సీసీఆర్‌సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు సులభంగా రుణాలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి బ్యాంకర్ల వద్ద ఉన్న దరఖాస్తులను పరిష్కరించి ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. విద్యా రుణాలు విరివిగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన మంత్రి ముద్రా యోజన కింద రుణాల మంజూరుపై పూర్తి దృష్టి సారించాలన్నారు. యూనియన్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా మరిన్ని ఉపాధి శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ద్వారకాతిరుమల వంటి పుణ్యక్షేత్రాల్లో ప్రసాదాల పంపిణీకి వినియోగించే విస్తర్ల తయారీపై గిరిజన ప్రాంతాల్లో మహిళలకు శిక్షణనిచ్చి ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి జీవనోపాధికి దోహదపడాలని సూచించారు. ఆవులు, గేదెల యూనిట్ల ఏర్పాటుకు విరివిగా రుణాలు ఇవ్వాలని చెప్పారు. లక్ష్యాలు సాధించేందుకు మండల వారీగా క్యాంపులు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులతో దరఖాస్తు చేయించాలని పశు సంవర్ధకశాఖ జేడీని ఆదేశించారు.

స్టాండప్ ఇండియాపై వర్క్ షాప్

ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా అమలు చేస్తున్న స్టాండప్ ఇండియా పథకంపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించే దిశగా సంబంధిత అధికారులు, బ్యాంకర్లు, సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. జూలై మాసంలో సామాజిక పెన్షన్ల సొమ్ము విడుదల చేయడంలో బ్యాంకర్ల కృషిని కలెక్టర్ అభినందించారు. సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డీఓ పూర్ణిమ, ఎల్‌డీఎం డి. నీలాద్రి, నాబార్డ్ డీడీఎం అనీల్ కాంత్, డీఆర్డీఏ పీడీ డా.ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానియేల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

దత్తత పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి



కలెక్టర్ వెట్రిసెల్వి సమక్షంలో దంపతులకు బాబును దత్తత ఇస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనల ప్రకారం దత్తతకు దరఖాస్తు చేసుకున్న సురేందర్, మహాలక్ష్మి దంపతులకు ఏలూరు శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న 3 నెలల మనోజ్‌ను కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమక్షంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకున్న పిల్లలను జాగ్రత్తగా పెంచాలని, విద్యాబోధన చెప్పించి ఉన్నతమైన స్థానంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులకు తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ అధికారి కెవీల్ పద్మావతి పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశం కోసం వినతి : తాను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశానని, తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోనికి తీసుకుని తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏలూరుకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు ఎ.అనురాధ కలెక్టర్‌ను కోరగా, వెంటనే సదరు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

రూ.13.55 కోట్లతో ఏజెన్సీలో రోడ్ల నిర్మాణం



ఐటీడీఏ గిరిజన దర్బారులో వినతులు స్వీకరిస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: పీఎం జన్మాన్ పథకంలో సుమారు 22.99 కిలోమీటర్ల మేర కొండరెడ్డి గిరిజన గ్రామాలకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్లు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. కేఆర్ పురం ఐటీడీఏలో బుధవారం గిరిజన దర్బారు నిర్వహించారు. సుమారు 29 దరఖాస్తులను పీఓ స్వీకరించారు. బుట్టాయగూడెం మండలం మెరకగూడెంకు చెందిన గిరిజన మహిళలు తమ గ్రామంలో ఉన్న విద్యార్థులకు 5వ తరగతి వరకూ చదువుకునే అవకాశం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. వేలేరుపాడు మండలం టేకుపల్లికి చెందిన సూరపరెడ్డితోపాటు పలువురు చేపలు పట్టుకోవడానికి ఇంజిన్ బోటు ఏర్పాటుకు వినతిపత్రం అందజేశారు. పీఓ సూర్యతేజ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం దొరమామిడి నుంచి వీరమద్దిగూడెం, బొత్తప్పగూడెం నుంచి దండిపూడి, పందిరిమామిడిగూడెం నుంచి ఇనుమూరు, గురుగుమిల్లి నుంచి పూచికగొంది, లంకలపాల నుంచి రేగులపాడు వరకూ రోడ్డు నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోదావరి వరద నివారణ చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో 8, 9 నెలలు నిండిన 900 మంది గర్భిణులను గుర్తించామన్నారు. వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వారి ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతంలో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు.

పెరుగుతున్న గోదావరి వరద



పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్ద ప్రవహిస్తున్న వరద

పోలవరం రూరల్: గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. ఉప నదుల నీటితో పాటు కొండ కాలువల నీరు కూడా నదిలోకి చేరడంతో ఉధృతి పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్ద బుధవారం 26.770 మీటర్లకు నీటిమట్టం చేరింది.

పీస్ కమిటీల ఏర్పాటుకు వినతి

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో పీస్ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్పీ డి.మేరీ ప్రశాంతికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచు హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఇటీవల ప్రజలు అశాంతికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాజకీయ నాయకులు వారి స్వలాభాలు, స్వార్థాల కోసం కార్యకర్తలను రెచ్చగొట్టి వారి మధ్య గొడవలు సృష్టిస్తున్నారన్నారు. రెవెన్యూ, కులసంఘాల పెద్దలు, మత పెద్దలు, పోలీసు శాఖతో కలిసి గ్రామ పంచాయతీలలో పీస్ కమిటీలు వేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



వేములపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగేంద్రకు ఆర్థిక సాయం అందిస్తున్న కె.విజయరాజు

లింగపాలెం: లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో ఇటీవల టీడీపీ దాడికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దొడ్డిగర్ల నాగేంద్రకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి రూ.50 వేల సాయం అందజేశారు. బుధవారం రాత్రి చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు చెక్కును నాగేంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ విషయాన్ని జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.50 వేల నగదు చెక్కును పంపించినట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని కార్యకర్తలు నిరుత్సాహం చెందవద్దన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. టీడీపీ కవ్వింపు చర్యలకు పాల్పడుతుందని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమయమనం పాటించి శాంతియుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొఠారి మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు సొసైటీ మాజీ చైర్మన్ రెడ్డిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలి



ఎం.నాగులపల్లిలో శిక్షణా తరగతుల కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరావు

ద్వారకాతిరుమల: వ్యవసాయం సంక్షోభంలో ఉందని.. అన్నదాతలు అప్పుల ఊబిలో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు రక్షణకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో కూరగాయల ఉత్పత్తిదారుల సంఘ భవనంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహా అధ్యక్షతన జరిగిన ఈ తరగతుల్లో కేశవరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ సంక్షోభానికి పాలకుల విధానాలే కారణమని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాల్సి ఉన్నా అది జరగడం లేదన్నారు. రైతు పెట్టుబడి కంటే మద్దతు ధరలు తక్కువగా ఉండటం వలన రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల వ్యవసాయంగా మార్చడం దారుణమన్నారు. రైతు రక్షణకు, వ్యవసాయరంగ పరిరక్షణకు అన్నదాతలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంటల రైతాంగ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, వడ్డీ లేని పంట రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కో–కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ తదితరులున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయు నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): కార్మిక సమస్యలు పరిష్కరించాలని దేశవ్యాప్త పిలుపులో భాగంగా డిమాండ్స్ డే కార్యక్రమాన్ని ఏలూరు కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని తదితర డిమాండ్లపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఐటీయు నగర కార్యదర్శి వి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ అమలు చేసిన కార్మిక వ్యతిరేక విధానాలపై గత పదేళ్ళుగా దేశవ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించామన్నారు. కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు ఇచ్చే పెన్షన్‌ను కనీసం రూ.9 వేలకు పెంచాలని కోరారు. కొన్ని గ్రామాలలో టీడీపీ వారు కారనే నెపంతో అంగన్‌వాడీ, వీఓఏ, మెప్మా ఆర్‌పి, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను బలవంతంగా తొలగిస్తున్నారని ఇలాంటి చర్యలు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

చిట్టి చేతుల్లో.. చక్కని చిత్తరువులు

- చిత్రకళలో రాణిస్తున్న తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు
- జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతూ పతకాల పంట
- అంశం ఏదైనా అలవోకగా చిత్రాలు గీస్తూ ఆకట్టుకుంటున్న వైనం
- చిత్రకళ ఉపాధ్యాయుడు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వెలుగులోకి..



చిత్రలేఖనంలో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు (ఫైల్)



తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

తణుకు అర్బన్: చిట్టి చేతులతో ఆకట్టుకునే చిత్రాలు గీస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు తణుకులోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు. అంశం ఏదైనా అలవోకగా చిత్రాలు గీస్తుండటమే కాక పలు ప్రాంతాల్లో నిర్వహించే పోటీల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. చిట్టి చేతుల్లో రూపుదిద్దుకున్న పలు చిత్రాలు జాతీయ స్థాయిలో బంగారు పతకాల పంట పండిస్తున్నాయి. ఏ అంశంలో చిత్రాన్ని వేసినా ఆ అంశం ఆ చిత్రంలో ఇమిడిపోవడం ఆ విద్యార్థుల ప్రతిభకు తార్కాణం. ఇక్కడి విద్యార్థులు చిత్రకళ పోటీల్లో పాల్గొంటున్నారంటే ఇక పతకాలు వారికే సొంతం అనేంతగా చిత్రకళలో ఎదుగుతున్నారు. పాఠశాలలో చిత్రకళలో విద్యార్థులకు అందుతున్న శిక్షణ, ఉపాధ్యాయుల కృషితో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

జాతీయ స్థాయిలో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు, చిత్రకళ ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. గుంటూరు, నెల్లూరు, విజయవాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, వాతావరణ కాలుష్యం, పచ్చదనం–పరిశుభ్రత, జాతీయ నాయకుల చిత్రాలు వంటి అంశాల్లో విద్యార్థుల గీసిన చిత్రాలు ఆహూతులను ఆలోచింపచేయడమే కాకుండా పలు పతకాలను సాధించిపెడుతున్నాయి. ఇటీవల నెల్లూరు, విజయవాడలో జరిగిన జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో 35 మంది విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించడం విశేషం. చిత్రకళలో విద్యార్థులకు నేర్పిస్తున్న మెలకువలతోపాటు విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 100 మందికి పైగా విద్యార్థులు చిత్రకళలో సత్తా చాటుతున్నారు.

కట్టిపడేస్తుంటాయి



మా విద్యార్థులు వేసే చిత్రాలు ఒకోసారి నాకే ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. చిత్రకళలోని మెలకువలను చెప్పగానే పట్టేసే స్వభావం మా విద్యార్థుల్లో ఉంది. ఏ ప్రాంతంలో పోటీలకు వెళ్లినా పతకాలతో తిరిగి రావడం అలవాటుగా మారింది. ఎంతో తపనతో సాధన చేసే విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం బాగుంది. – **డాక్టర్ వెంపటాపు, చిత్రకళ ఉపాధ్యాయుడు, తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు**

చిత్రకళపై పట్టు సాధించా



చిత్రకళలో చిన్ననాటి నుంచి ఉన్న ఇష్టంతో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలులో గురువులు ద్వారా చిత్రకళను నేర్చుకున్నాను. వివిధ ప్రాంతాల్లో నిర్వహించే చిత్రకళా పోటీల్లో పాల్గొనడమే గతంలో గొప్పగా ఉండేది. ఇప్పుడు బంగారు పతకాలు సాధించేలా చిత్రకళపై పట్టు సాధించా. నాకు చాలా సంతోషంగా ఉంది.

– టి.రవిచరణ్, విద్యార్థి

ఆసక్తి ఉంటే చాలు.. నేర్చుకోవచ్చు



చిత్రాలను గీయడంలో కొంచెం ఆసక్తి ఉంటే చాలు. మా పాఠశాలలో గురువులు చెబుతున్న మెలకువలు చాలా సులువుగా ఉంటాయి. మామూలుగా డ్రాయింగ్ క్లాస్‌లో చెప్పిన పాఠాలతోనే నేను నేర్చుకున్నాను. ఇప్పుడు పోటీల్లో బంగారు పతకాలు సాధించేలా చిత్రాలు వేయగలుగుతున్నాను.

– టి.ఆదిలక్ష్మి, విద్యార్థిని

ఎక్కువ సమయం సాధన చేస్తా



డ్రాయింగ్ అనేది నాకు చాలా ఇష్టమైన సబ్జెక్ట్. చిత్రాలను గీయడంపై సాధన కోసం ఎక్కువ సమయం కేటాయిస్తుంటాను. మెలకువలు నేర్చుకోవడంతో మరింత దృష్టి సారించి పోటీల్లో పాల్గొనే స్థాయికి చేరాను. పాఠశాల నుంచి వివిధ కాంపిటీషన్స్‌కు వెళ్లి బంగారు, వెండి పతకాలు సాధించాను.

– ఎస్.జోషిక, విద్యార్థిని

మెలకువలు నేర్పించారు



డ్రాయింగ్ తరగతి అంటే నాకు చాలా ఇష్టం. డ్రాయింగ్ నేర్పించే విధానం చాలా బావుంటుంది. అర్థమయ్యే రీతిలో చెప్పడమే కాకుండా సులువుగా చిత్రాన్ని వేసేలా ఉపాధ్యాయులు మెలకువలు నేర్పించారు. అందుకే నేను పాల్గొనే ప్రతి పోటీలో పతకాలు సాధిస్తుంటాను.

– ఎస్.ఖ్యాతిక, విద్యార్థిని

క్లుప్తంగా

విద్యుత్ విజిలెన్స్ దాడులు

178 సర్వీసులకు రూ.5.53 లక్షల జరిమానా



విజిలెన్స్ దాడుల వివరాలను తెలుపుతున్న ఏపీసీపీడీసీఎల్ అధికారులు

నూజివీడు: అన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు బుధవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో మొత్తం రూ.5.53 లక్షల జరిమానాను విధించారు. విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు, నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో 47 బృందాలు ఏకకాలంలో 2,955 గృహ సర్వీసులను, 113 వాణిజ్య సముదాయ సర్వీసులను, 7 పారిశ్రామిక సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 175 సర్వీసులకు అదనపు లోడు వాడుతున్నారని గుర్తించి రూ.5.42 లక్షల జరిమానా విధించారు. అలాగే విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న మూడు సర్వీసులకు రూ.11 వేల జరిమానాను విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీటరు లోడు కంటే ఎక్కువ లోడు విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లయితే అదనపు లోడుకు డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అలాగే విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లయితే 94408 12362, 8331 014951 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో నూజివీడు టౌన్, రూరల్ డీఈలు ఓలేటి దుర్గారావు, పోతురాజు, రూరల్ ఈఏ గౌరునాయుడు, విస్సన్నపేట, తిరువూరు డీఈలు కె.నారాయణ, పి.రామకృష్ణ, డివిజన్‌లోని ఏఈలు పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్‌పై చర్యలకు వినతి

ఏలూరు (టూటౌన్): పోస్టల్ శాఖకు నష్టం కలుగజేసిన పోస్టుమాస్టర్ గంజి గంగాధర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడలో పోస్ట్‌మాస్టర్ జనరల్‌కు ప్రజా సంఘాల నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వివరాలను ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ఏలూరు పెద్ద పోస్టాఫీస్ హెడ్ పోస్ట్‌మాస్టర్‌గా గంజి గంగాధర్ గత నెల నాలుగో తేదీ వరకు విధులు నిర్వహించారు. 2023 అక్టోబర్‌లో పెద్ద పోస్టాఫీస్‌లోని జనరేటర్‌కు సంబంధించిన బ్యాటరీని గంగాధర్ తన సొంత ప్రయోజనాల కొరకు దాచి వేసి దొంగలు ఎత్తుకుపోయినట్లుగా చిత్రీకరించి కాపలాదారులైన ఇద్దరు నైట్‌వాచ్‌మెన్ల నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. పాత బ్యాటరీనే జనరేటర్‌కు బిగించి వాడారన్నారు. జంగారెడ్డిగూడెంకు గంగాధర్ బదిలీపై వెళుతూ ఇదే బ్యాటరీని వెంట తీసుకెళ్లారని ఆరోపించారు. దీంతో ఏలూరు కార్యాలయంలో విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పోస్ట్‌మాస్టర్ గంగాధర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నేతల రమేష్‌బాబు, భూపతి అప్పారావు, కొత్తల పూర్ణమల్లికార్జున్ ఉన్నారు.

హత్య కేసులో భార్యాభర్తల అరెస్ట్

ముదినేపల్లి రూరల్: చిగురుకోటలో జరిగిన మహిళ హత్య కేసులో నిందితులైన భార్యాభర్తలను అరెస్టు చేసినట్లు ఎస్సై డి.వెంకటకుమార్ బుధవారం చెప్పారు. చిగురుకోటకు చెందిన భార్యాభర్తలు దేవి, వరసా బాలాజీలకు తుమ్మా సురేష్–అనిత మధ్య సరిహద్దు విషయమై ఈ నెల 3న ఘర్షణ జరగ్గా భార్యాభర్తలైన సురేష్, అనితలు బాలాజీ భార్య దేవిపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 5న మరణించింది. ఈ ఘటనపై కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితులైన భార్యభర్తలు సురేష్, అనితలను మంగళవారం అరెస్టు చేసి కైకలూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రెడ్డిగణపవరంలో హుండీ చోరీ



శివాలయంలో హుండీని పగులగొట్టిన దృశ్యం

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలోని శివాలయంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గుడి తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించి హుండీ ధ్వంసం చేసి నగదు అపహరించడమే కాక సీసీ టీవీ సామగ్రిని అపహరించారని ఆలయ ధర్మకర్తలు భౌమరాజు ధనుంజయరాజు, సత్యనారాయణ రాజు చెప్పారు. ఉదయం స్వామివారికి పూజ చేసేందుకు పూజారి వచ్చి చూడగా గుడి తలుపులు పగలకొట్టి ఉండటాన్ని గమనించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. తాము వచ్చి పరిసరాలను పరిశీలించగా హుండీ పగలకొట్టి ఉందని, సీసీ కెమెరా సామగ్రిని పట్టుకుపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

శ్రీవారి క్షేత్రంలో జ్యూస్ దుకాణం సీజ్

- నిల్వ పాలు వినియోగిస్తున్నట్లు అజ్ఞాత భక్తుడు ఫిర్యాదు
- ఆలయ అధికారుల తనిఖీల్లో 217 నిల్వ ప్యాకెట్ల గుర్తింపు
- వ్యాపారిపై కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



జ్యూస్ షాపులో నిల్వ పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఆలయ అధికారులు



నిల్వ పాల ప్యాకెట్ల శాంపిల్స్‌ను సేకరించి, కేసు నమోదు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి రామరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో జ్యూస్‌ల తయారీలో నిల్వ పాల ప్యాకెట్లను వినియోగిస్తూ భక్తుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఒక వ్యాపారి బాగోతం ఒక అజ్ఞాత భక్తుడి ఫిర్యాదుతో బుధవారం బట్టబయలయ్యింది. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ తూర్పు ప్రాంతంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక వ్యాపారి శ్రీ లక్ష్మి దుర్గ బాలాజీ జ్యూస్ షాపును నిర్వహిస్తున్నాడు. ఆ షాపులో నిల్వ పాల ప్యాకెట్లను జ్యూస్‌ల తయారీకి వినియోగిస్తున్నారని ఒక అజ్ఞాత భక్తుడు దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేశాడు. దాంతో సదరు జ్యూస్ షాపులో ఆలయ సూపరింటెండెంట్‌లు డి.వెంకట నరసింహ రాజు, హయగ్రీవా అప్పలాచార్యులు ఉదయం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. షాపులోని ఫ్రిజ్‌లో మొత్తం 217 పాల ప్యాకెట్లు ఉండగా, అవన్నీ నిల్వ ప్యాకెట్లుగా అధికారులు గుర్తించారు. అనంతరం పంచనామాను నిర్వహించి ఈనెల 4వ తేదీతో గడువు ముగిసిన 96 పాల ప్యాకెట్లు, 6వ తేదీతో ముగిసిన 16 ప్యాకెట్లు, 9వ తేదీతో గడువు ముగిసిన 100 ప్యాకెట్లను, వీటికన్నా ముందు తేదీలకు సంబంధించిన 5 ప్యాకెట్లను మొత్తం 217 పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించి సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న ఏలూరు డివిజన్–1 ఫుడ్ సేఫ్టీ అధికారి కె.రామరాజు తన సిబ్బందితో కలిసి జ్యూస్ షాపును పరిశీలించి, నిల్వ పాల ప్యాకెట్ల శాంపిల్స్‌ను సేకరించారు. ఆ తరువాత షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, నోటీసు జారీ చేశారు. సదరు జ్యూస్ షాపును దేవస్థానం అధికారులు తాత్కాలికంగా సీజ్ చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను గోదావరిలో పడవేయవద్దు

- పోలవరం సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య
- టూరిజం బోట్‌ల యజమానులు, నిర్వాహకులతో సమావేశం



పోలవరంలో మాట్లాడుతున్న సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య

పోలవరం రూరల్: వన్యప్రాణుల సంరక్షణార్థం గోదావరి నదిలో పొల్యూషన్ లేకుండా చూడాలని సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య అన్నారు. పోలవరం అటవీశాఖ కార్యాలయం వద్ద బుధవారం టూరిజం బోట్‌ల యజమానులు, నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ డీఎఫ్‌వో మాట్లాడుతూ నేషనల్ పార్క్ పరిధిలో పాపికొండల సందర్శనకు తిరిగే టూరిజం బోట్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలను గోదావరి నదిలో పడవేయకూడదన్నారు. పర్యాటకులు వాడి వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలు, డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు, డ్రింక్ బాటిళ్లు నదిలో పారవేయకుండా బోట్లలో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలలో వేసేలా బోటు యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి నదీ ఒడ్డున ఎక్కడా వ్యర్థాలు చేరకుండా చూడాలన్నారు. గండిపోశమ్మ గుడి నుంచి పేరంటపల్లి వరకు వెళ్లి తిరిగి వచ్చే టూరిజం బోట్లలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో వేయకుండా బోటు యజమానులు, సిబ్బంది పర్యాటకులకు తెలియజేయాలన్నారు. బోటు యజమానులకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో పోలవరం, కుక్కునూరు అటవీశాఖ రేంజ్ అధికారులు దావీద్‌రాజు, ఏడుకొండలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దివ్యదక్షిణ, ఉత్తరాఖండ్ యాత్రలు



ఏలూరులో యాత్రల బ్రోచర్ విడుదల చేస్తున్న విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దేవభూమి ఉత్తరాఖండ్ యాత్ర, దివ్య దక్షిణ యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా చెప్పారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యాత్రల వివరాలను ఆయన వెల్లడించారు. దివ్య దక్షిణ యాత్ర ఆగస్టు 4న ప్రారంభమై 12వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో భాగంగా అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రమ్, తిరుచీ, తంజావూర్ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చన్నారు. ఈ రైలు ఆగస్టు 4న మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్‌లో ఆగుతుందన్నారు. ఈ యాత్రకు సంబంధించి స్లీపర్ క్లాస్ రూ.14,250, థర్డ్ ఏసీ రూ.21,900, సెకండ్ ఏసీ రూ.28,450గా టికెట్ ధరలు నిర్ణయించామన్నారు.

9 నుంచి ఉత్తరాఖండ్ యాత్ర

దేవభూమి ఉత్తరాఖండ్ యాత్రలో భాగంగా భారత్ గౌరవ్ రైలు ఆగస్టు 9న ప్రారంభమై 20వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. ఈ రైలు విశాఖపట్టణంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై రాజమండ్రి, విజయవాడలో ఆగుతుందన్నారు. యాత్రలో భాగంగా భీమాల్, అల్మోరా, కౌసని, రాణిఖేత్ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చన్నారు. యాత్ర 10 రాత్రులు,11 పగలు జరుగుతుందన్నారు. థర్డ్ ఏసీ రూ.28,020, డీలక్స్ రూ.35,340గా టికెట్ ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. యాత్రల్లో భాగంగా ప్రయాణికులకు అల్పాహారం, ఆహారం, రాత్రి భోజనం అందజేస్తామన్నారు. యాత్రల్లో భాగంగా రవాణా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఐఆర్‌సీటీసీ చీఫ్ సూపర్‌వైజర్ వీవై ప్రసాద్ మాట్లాడుతూ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైలు ప్యాకేజీలు, ఎయిర్ ప్యాకేజీలు అందిస్తున్నట్లు చెప్పారు. యాత్రల పూర్తి వివరాల కోసం బాలాజీ 92810 30714, ప్రవీణ్ 92814 95848 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

13న విజయవాడలో సౌత్ జోన్ త్రోబాల్ సెలక్షన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సౌత్ జోన్ త్రోబాల్ టోర్నమెంట్ సెలక్షన్స్ విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 13న నిర్వహించనున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, జనరల్ సెక్రటరీ ఎస్ఎం శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, స్త్రీల విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, వీటిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఆగస్టులో బెంగుళూర్‌లో జరిగే సౌత్ జోన్ టోర్నమెంట్‌కు పంపుతామని చెప్పారు. క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, ఎనిమిది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 97012 03030, 72879 65417 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'నీలి నాలుక'తో జీవాలకు ముప్పు

- దోమ ద్వారా గొర్రెలు, మేకలకు వ్యాపిస్తున్న వ్యాధి
- వర్షాకాలం ప్రారంభంలో ఎక్కువగా సోకే ప్రమాదం
- టీకా వేయించడం ద్వారా ముందస్తు వ్యాధి నివారణ



జీవానికి వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

దెందులూరు/జంగారెడ్డిగూడెం: వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే నీలినాలుక వ్యాధి వల్ల గొర్రెలు, మేకలకు ప్రాణహాని పొంచి ఉందని పశు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే వైరస్ వల్ల ఏటా దాదాపు పది శాతం గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఒక గొర్రె నుంచి మరో గొర్రెకు వ్యాపించే ఈ వైరస్ చాలా తక్కువ వ్యవధిలో జీవాలను పొట్టన పెట్టుకునే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గొర్రెల పెంపకందారులు ముందస్తు టీకాలను వేయించడంతో పాటు వ్యాధి సోకిన గొర్రెలకు సరైన చికిత్సను ఇస్తూ కాపాడుకోవాల్సి ఉంటుంది. నీలి నాలుక వ్యాధిని కలిగించే వైరస్‌ను ఆర్బీ వైరస్ అని పిలుస్తారు. ఈ వైరస్‌లో 24 వేరియంట్లు ఉండటం వల్ల వ్యాధి నివారణ టీకాలను తయారు చేయడం కూడా కష్టంగా మారిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్యూలికాయిడిస్ అనే దోమ వల్ల వ్యాపించే ఈ వ్యాధి మందలో ఉన్న అన్ని గొర్రెలకు చాలా అనతి కాలంలోనే వ్యాపిస్తుంది. వ్యాధికి గురైన గొర్రెలను గుర్తించి వెంటనే వాటిని మంద నుంచి వేరు చేయాలి. అలాగే వ్యాధి బారిన పడిన పొట్టేలు వీర్యం ద్వారా కూడా ఈ వ్యాధి ఇతర గొర్రెలకు వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు

నీలి నాలుక వ్యాధిబారిన పడిన గొర్రెల్లో తీవ్రమైన జ్వరం 104 డిగ్రీల నుంచి 106 డిగ్రీల వరకూ ఉంటుంది. అలాగే వాటి నాలుక వాపు ఉండటమే కాకుండా లేత నీలి రంగులో కనిపిస్తుంది. పెదాలు, చిగుళ్ళు, ముఖంలో కూడా వాపు కనిపిస్తుంది. ముక్కు, కన్ను నుంచి నీరు కారుతుంది. కాలి గిట్టల దగ్గర ఎర్రగా వాపు రావడంతో గొర్రెలు నడవడానికి కూడా వీలు లేక కుంటుతూ నడుస్తాయి. న్యూమెనియా లక్షణాలు ఉన్న గొర్రెల్లో శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారుతుంది.

చికిత్స విధానం

వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే పశువైద్యుడి సలహా మేరకు చికిత్స చేసుకోవాల్సి ఉంటుంది. వ్యాధిబారిన పడిన గొర్రెల నోటిలో వాపు, పుండ్లు ఉండటంతో అవి మేత మేయడానికి కూడా ఇబ్బంది పడతాయి. సులభంగా జీర్ణమయ్యే గంజి లాంటి ఆహార పదార్థాలను కొద్దిగా ఉప్పు కలిపి తాగించాలి. అందులో ఓఆర్ఎస్ వంటి ద్రావణాలను కలిపి వ్యాధి తగ్గే వరకూ తాగించాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికమ్ లేదా అనాల్జిమ్ వంటి మందులను వాడాలి. సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉన్నట్లయితే యాంటీబయాటిక్ ముందులను కూడా వాడాలి. న్యూమోనియా లక్షణాలు ఉంటే వాటి నివారణకు మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధి నివారణ

గొర్రెలు, మేకలు నీలిక నాలుక వ్యాధి బారిన పడకుండా నివారించడానికి క్రమం తప్పకుండా బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించాల్సి ఉంటుంది. మూడు నెలలు పైబడిన గొర్రెపిల్లలకు 2 ఎంఎల్ చొప్పున మొదటి టీకా వేయించాలి. మళ్లీ 21 రోజులకు బూస్టర్ టీకా వేయించాలి. అక్కడ నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు–అక్టోబర్ మధ్య కాలంలో టీకాను క్రమం తప్పకుండా వేయించాలి. గొర్రెల మందను నిలిపే పాకలో దోమలు వ్యాపించకుండా దోమతెరలు కట్టాలి లేదా వేపాకు పొగను వేయాలి.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల బారిన పడకుండా జీవాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎప్పటికప్పుడు మందలోని గొర్రెల ఆరోగ్యాన్ని పరిశీలిస్తూ ఉండాలి. నీలి నాలుక వ్యాధితో పాటు ఏ ఇతర జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పశు వైద్య కేంద్రాన్ని సంప్రదించాలి.

– **జి.నెహ్రూబాబు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్**

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాళ్ల: ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. కాళ్ల పోలీసులు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముదినేపల్లి మండలం పెద్దగునూరుకు చెందిన రమణమ్మ (55) బంధువైన శంకర్‌తో కలిసి మంగళవారం భీమవరం చెవిటి మిషన్ తీసుకునేందుకు బైక్‌పై వెళుతున్నారు. మండలంలోని పెదఅమిరం వద్దకు వచ్చేసరికి బైక్ గొయ్యిలో పడటంతో వెనుక కూర్చొన్న రమణమ్మ అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ సంఘటనలో రమణమ్మ తలకు గాయం కాగా భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శంకర్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో కోళ్ల పెంపకంపై శిక్షణ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో త్వరలో కోళ్ల పెంపకం వాటి యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాల కోసం 99896 23823 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవాలని కోరారు.